క్లుప్తంగా

అక్టోబర్ 5న ఏకపాత్రాభినయ పోటీలు



విజయవాడ కల్చరల్: శ్రీరామకృష్ణా నాట్య మండలి(సాంస్కృతిక సేవా సంఘం) 50 వ వార్షికోత్సవం సందర్భంగా అక్టోబర్ 5 వ తేదీన విజయవాడలో రాష్ట్ర స్థాయి ఏకపాత్రాభినయ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రావణ్‌కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. కొత్తా పూర్ణానందం కళావేదికగా జూనియర్, సీనియర్ విభాగాలలో పోటీలు ఉంటాయని పౌరాణికం, సాంఘికం, చారిత్రక అంశాలను పోటీదారులు ఎంపిక చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత పోస్టర్‌ను అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో రంగస్థల ప్రముఖులు డాక్టర్ పీవీఎన్ కృష్ణ, డాక్టర్ జొన్నలగడ్డ జగన్మోహనరావు, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రవేశరుసుము లేదని ఎవరైనా ఉచితంగా పాల్గొనవచ్చునని చెప్పారు. పేర్ల నమోదుకు చివరితేదీ అక్టోబరు 2 అని, ఇతర వివరాలకు 85006 42543, 83747 60657 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బుడమేరులో అడ్డంకుల తొలగింపు



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ రామవరప్పాడు పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌కాలనీ వద్ద బుడమేరు నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న పైపుబ్రిడ్జిని తొలగించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఇంజనీరింగ్ అధికారులు జేసీబీలను తీసుకువచ్చి ఈ చర్యలు చేపట్టారు. నగరంలోని బుడమేరు నీరు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా ప్రవహించేందుకు ఉన్న అడ్డంకులను తొలగించాలన్న కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నట్లు నగరపాలక సంస్థ అధికారులు ఒక ప్రకటన విడుదల తెలిపారు.

వైభవంగా ఆదిభట్ల జయంత్యుత్సవాలు



విజయవాడ కల్చరల్: ఆదిభట్ల నారాయదాసు శిష్యప్రశిష్య బృందం, అన్నమయ్య పరివారం, ప్లాంజేరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు 161 వ జయంతి ఉత్సవాల సందర్భంగా సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణమండపంలో నిర్వహిస్తున్న హరికథా ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం నాటి కార్యక్రమాలను వయొలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తి ప్రారంభించారు. హరికథా మహోత్సవాలలో భాగంగా తిరుపతికి చెందిన నాగరాణి శ్రీనివాస కల్యాణం, వై.వెంకటేశ్వర్లు ద్రౌపదీ మానసంరక్షణ, పసుపులేటి శివ కుమారి సుభద్రా కల్యాణం, విజయవాడకు చెందిన బుర్రా నరసింహశర్మ భక్తరామదాసు కథలను సంగీత, సాహిత్యాలను మేళవిస్తూ వినిపించారు. నిర్వాహకుడు బుర్రా పద్మనాభం, వైవీ కృష్ణయ్య పర్యవేక్షణలో సంప్రం కృష్ణమూర్తి, మద్దెల సాయిబాబులను ఆత్మీయంగా సత్కరించారు.

ఆర్టీసీ ఆర్‌ఎంకు వినతి



బస్టాండ్(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల మహిళలకు వర్తింపజేయాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో గురువారం ఆయన ఆర్టీసీ ఆర్‌ఎం దానంను కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తన్నీరు మాట్లాడుతూ అంతరాష్ట్ర సర్వీసుల పేరుతో సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిస్సా సరిహద్దులలో ఉన్న సుమారు 50 నియోజకవర్గాల గ్రామీణ ప్రాంతాల మహిళలకు స్త్రీ శక్తి పథకం అమలుకావడం లేదన్నారు. జగ్గయ్యపేట బస్‌స్టాండ్ నుంచి ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు తెలంగాణ రాష్ట్రం కోదాడ, వైరా, హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ప్రయాణం చేసినప్పుడు ఆంధ్ర సరిహద్దు గ్రామీణ ప్రాంతాల వరకు స్త్రీశక్తి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించాలని ఆయన కోరారు.

రైతుబజార్లలో క్లాత్ బ్యాగ్స్ కౌంటర్లు ఏర్పాటు చేయండి

- ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి
- మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర



రైతుబజార్‌లో గుడ్డ సంచుల కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలిస్తున్న ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి రైతుబజార్‌లో గుడ్డ సంచుల(క్లాత్ బ్యాగ్స్) కౌంటర్లను ఏర్పాటు చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజార్, మహానాడు రోడ్, లయోలా కాలేజీ రోడ్, దంత వైద్య కళాశాల రోడ్డు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడను ఉంచాలనే లక్ష్యంతో నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని రైతుబజార్లలో స్వయం సహాయక బృందాలు తయారు చేసే గుడ్డ సంచులను అమ్మేందుకు కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా ఒక వైపు ప్లాస్టిక్ రహిత పర్యావరణ హితమైన వస్తువులను అమ్మటమే కాకుండా మరో వైపు స్వయం సహాయక బృందాలను ఆర్థికంగా బలోపేతం చేసినట్లు ఉంటుందని తెలిపారు.

వ్యర్థాలను తొలగించకపోవడంపై ఆగ్రహం

పర్యటనలో భాగంగా లయోలా కాలేజీ రోడ్‌ను పరిశీలించగా అక్కడ పేరుకుపోయిన వ్యర్థాలను గమనించి వాటిని ఎప్పటికప్పుడు ఎందుకు తొలగించలేదని కమిషనర్ ధ్యానచంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యర్థాలను తరలించేందుకు వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. మరమ్మతులకు గురైన వాహనాలకు రిపేర్ చేయించి అందుబాటులోకి తీసుకురావాలని, ప్రతి రోజూ వ్యర్థాలను కచ్చితంగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదార్లలో కంపాక్టర్ బిన్స్‌లను పూర్తి స్థాయిలో ఉంచాలన్నారు. ప్రతి రోజూ ఇళ్ల వద్ద సేకరించే వ్యర్థాలను ఎప్పటికప్పుడు గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించాలన్నారు. నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వ్యర్థాల నిర్వహణ జరగాలని అధికారులను ఆదేశించారు.

డ్రెయిన్‌లో నీరు నిల్వ ఉండకూడదు

మహానాడు రోడ్‌లో అవుట్‌ఫాల్ డ్రెయిన్‌ను పరిశీలించి డ్రెయిన్‌లో నీరు నిలిచి ఉండకూడదని, నిరంతరాయంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆ దిశగా పట్టణ ప్రణాళిక అధికారులు చేసిన మార్కింగ్‌లను అనుసరిస్తూ ఆక్రమణలను తొలగిస్తూ డ్రెయిన్‌లోని మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. దంత వైద్య కళాశాల రోడ్‌లో ఏర్పాటు చేసిన పూల మొక్కలను పరిశీలించి నగరంలో మొక్కల శాతాన్ని మరింత పెంచి నగర సుందరీకరణకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్ రెడ్డి, యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకట నారాయణ, పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యనారాయణ, హార్టీకల్చర్ డెప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్, సీడీఓ ఉమామహేశ్వరి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆధ్వర్యంలో గురువారం గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కనీసం ఐదు నుంచి పదిలక్షల ఇళ్లు సౌరశక్తితో ఉండాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ఈ పథకం కింద అందే రుణసదుపాయం, రాయితీ వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ సూర్య శక్తి ద్వారా కలిగే లాభాలు, ప్రభుత్వం కల్పించే సబ్సిడీ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రిసోర్స్ పర్సన్స్, వార్డ్ వెల్ఫేర్, ప్లానింగ్ సెక్రటరీలను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ ఎన్.బాలస్వామి, జోనల్ కమిషనర్ కె.ప్రభుదాస్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్ పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు... గొల్లపూడి ఎన్టీఆర్ నగర్‌కు చెందిన మేకల మౌనికకు సమ్మెట వీరాంజనేయులుతో 2017లో వివాహమైంది. వివాహ సమయంలో కట్నం కింద రూ.2 లక్షల నగదు, బంగారం గొలుసు, ఉంగరం ఇచ్చారు. వివాహానంతరం భర్తతో కలిసి విశాఖపట్నం కాపురానికి వెళ్లింది. ఆ తర్వాత భర్త ఉద్యోగం రీత్యా ఖతార్ వెళ్లాడు. ఆ సమయంలో అత్త, మామలు ఆమెను పుట్టింటికి పంపించారు. కొన్నాళ్ల తర్వాత ఆమె ఖతార్‌కి వెళ్లి జబ్బుపడింది. వైద్యం చేయించకుండా భర్త ఇబ్బందులు పెట్టడంతో అక్కడ నుంచి వచ్చి మరలా కొన్నాళ్ల తర్వాత ఖతార్ వెళ్లింది. పెళ్లయిన నాటి నుంచి అత్త, మామ, తోడికోడలు అందరూ కలిసి చీటికీ మాటికీ దుర్భాషలాడుతూ ఆమెను ఇబ్బందులకు గురిచేశారు. శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేశారు. అదనపు కట్నం తేవాలంటూ వేధింపులకు పాల్పడ్డారు. వారి వేధింపులు భరించలేక భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బయటకు వెళ్లిన తన భార్య తిరిగి ఇంటికి చేరలేదంటూ ఆమె భర్త చేసిన ఫిర్యాదు మేకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు జక్కంపూడి కాలనీ బ్లాక్ నెంబరు 185లో మత్తే నాగరాజు, దేవి కళ్యాణి (26) దంపతులు నివాసం ఉంటున్నారు. నాగరాజు గోడ గడియారాల మార్కెటింగ్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన నాగరాజు లైన్‌కు వెళ్లగా, అదేరోజు సాయంత్రం కళ్యాణి పని మీద బయటకు వెళ్లి వస్తానంటూ ఎదురింట్లో తాళం ఇచ్చి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. రాత్రి ఇంటికి వచ్చిన నాగరాజు భార్య లేకపోవడం గమనించి బంధువులను ఆరా తీశాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

కార్పొరేటర్ సత్యబాబు

వింబిపేట(విజయవాడపశ్చిమ): కొత్తపేటలోని షేక్ రాజాసాహెబ్ ఆసుపత్రిలోని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. రాజాసాహెబ్ ఆసుపత్రిని గురువారం ఆయన సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సత్యబాబు మాట్లాడుతూ ఆస్పత్రికి రోజు 400మందికిపైగా రోగులు వస్తుండగా, తగినంతమంది వైద్యులు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులుపడుతున్నారన్నారు.

ఇక్కడ అన్ని రకాల వైద్యసేవలు అందించడంతో పాటు ఇరవై నాలుగు గంటలు డాక్టర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఫార్మసిస్ట్ ఒక్కరే ఉండటంతో మందులు తీసుకునేందుకు రోగులు గంటలపాటు క్యూలైన్‌లో నిల్చోవాల్సి వస్తోందన్నారు. తాగునీటి కూలర్‌ను బాగుచేయించాలని, ఆసుపత్రిలో డ్రెయినేజి వ్యవస్థను సరిచేయాలన్నారు. అత్యవసర సమయంలో రోగులను ప్రధాన ఆసుపత్రికి తరలించేందుకు అంబులెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.నవీన్‌కుమార్, కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాకిషోర్‌కు సేవారత్న అవార్డు



విశ్వజనని ఫౌండేషన్ చైర్మన్ బ్రహ్మానందం నుంచి అవార్డు అందుకుంటున్న దుర్గాకిషోర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కబేళాసెంటర్ బ్రహ్మయ్యకాలనీకి చెందిన వెంకట్ మహేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్తంశెట్టి దుర్గాకిషోర్‌కు విశ్వజనని సేవారత్న అవార్డ్ లభించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో బుధవారం రాత్రి నిర్వహించిన విశ్వజనని ఫౌండేషన్ వార్షికోత్సవంలో దుర్గాకిషోర్ ఈ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా దుర్గాకిషోర్ మాట్లాడుతూ ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు. తమ సేవలను గుర్తించి అవార్డు అందజేసిన విశ్వజనని ఫౌండేషన్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కమర్షియల్ ట్యాక్స్ ఎన్‌జీవోస్ అసోసియేషన్ విజయవాడ డివిజన్-1 నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎం విజయకాంత్ గురువారం తెలిపారు. సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన విజయవాడ డివిజన్-1 సంఘ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షురాలిగా ఎంపీ ప్రవీణ, అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్కే మస్తాన్‌వలి, ఉపాధ్యక్షులుగా సిహెచ్ సువర్ణరాజు, పీఎస్‌వీబీఏ వాసుదేవరాజు, కార్యదర్శిగా పీవీ నాగార్జున, కార్యాలయ కార్యదర్శిగా జి.మాణిక్యవీణ, సహాయ కార్యదర్శులు ఎం.రమేష్, అబ్దుల్‌ఖాజాబాబు, కోశాధికారిగా కె.కోటిబాబు ఎన్నికయ్యారు. డివిజన్-3 అధ్యక్షులు కేఆర్‌ఎస్ గణేష్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, సంఘ నేత జీఎస్‌వీ రత్నకుమార్ పర్యవేక్షించారు. నూతన కార్యవర్గానికి సంఘ రాష్ట్ర అధ్యక్షులు బీ వెంకటేష్‌బాబు అభినందనలు తెలియజేశారు.

ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చాలి

ఇళ్లు లేని హోటల్, బేకరీ కార్మికులకు రెండు సెంట్ల స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న దుర్గారావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చాలని, ఇళ్లు లేని హోటల్, బేకరీ కార్మికులకు రెండు సెంట్లు స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీఐటీయూ సెంట్రల్ సిటీ అధ్యక్షుడు కె.దుర్గారావు డిమాండ్ చేశారు. దుర్గాపురం సీఐటీయూ కార్యాలయంలో గురువారం విజయవాడ హోటల్ అండ్ బేకరీ వర్కర్స్ యూనియన్ 13 వ మహాసభ వల్లూరు జగదీశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ అండ్ బేకరీ కార్మికులందరికీ కనీస వేతనాలు, 8 గంటల పని విధానం, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రధాన కార్యదర్శి ఎంవీ రమణ మాట్లాడుతూ రెస్టారెంట్, బార్లలో పనిచేసే కార్మికులను గుర్తించి ప్రభుత్వమే లిక్కర్ షాపుల్లో ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అధిక ధరలను అరికట్టాలని, స్మార్ట్ మీటర్లు బిగించొద్దని, చార్జీలు రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలకు చేస్తూ చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది తొలుత సీఐటీయూ పతాకాన్ని గౌరవ అధ్యక్షుడు పి.కృష్ణమూర్తి ఆవిష్కరించారు అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం

నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా పి.కృష్ణమూర్తి, అధ్యక్షుడిగా వల్లూరు జగదీశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎంవీ రమణ, కోశాధికారిగా ఓ.నాగరాజు, ఆఫీస్ బేరర్స్‌గా జి.కొండయ్య, ఎం.సూర్యనారాయణ, ఎం.లక్ష్మణ, పి.ఆంజనేయులు, మొత్తం 19 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

శ్రీకృష్ణుని ప్రతిమ ఊరేగింపు



పాయకాపురం(విజయవాడరూరల్): త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపుతో ముగిశాయి. పాయకాపురం ఏపీఎస్ రెడ్డి రోడ్డు డాక్టర్స్ కాలనీలోని నాగవంశ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో ఈ నెల16వ తేదీ నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరుగుతున్నాయి. ఊరేగింపు పాయకాపురం పెట్రోల్‌బంక్ రైతుబజారు, ప్రకాష్‌నగర్ మీదుగా సుందరయ్యనగర్ నుంచి శ్రీకృష్ణ కొలువు ప్రాంగణం వరకు జరిగింది. కాళ్ళ సత్యం, సభ్యులు సురేష్, తిరుపతిరావు, సూరప్పడు, సీతప్పడు, శంకర్ పాల్గొన్నారు.

ముగిసిన పతంజలి యోగా కార్యక్రమం



ఆటోనగర్(విజయవాడ తూర్పు): నిత్యం యోగా చేయడం ద్వారా అన్ని అవయవాలు మంచిగా పనిచేస్తాయని ప్రముఖ వైద్యుడు మాణిక్యేశ్వర రావు అన్నారు. గత నాలుగు రోజుల నుంచి గురునానక్‌కాలనీ లోని సాయి జువెల్ కన్వెన్షన్ హాలులో పతంజలి ఆధ్వర్యంలో యోగా క్యాంపు నిర్వహించారు. గురువారంతో ఈ యోగా క్యాంపు ముగిసింది. ఈ సందర్భంగా మాణిక్యేశ్వరరావు మాట్లాడుతూ యోగా చేయడం వల్ల బీపీ, షుగరు, థైరాయిడ్‌తో పాటు కొద్దిపాటి అనారోగ్య సమస్యలు అదుపులో ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరు యోగాను తప్పనిసరిగా చేయాలని పిలుపు ఇచ్చారు. అనంతరం యోగాలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పతంజలి యోగా నిర్వాహకులు కావూరి ఆశోక్‌కుమార్, స్వామి రిత్‌దేవ్, జొన్నలగడ్డ శ్రీనివాస్, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గారావు, ఉపాధ్యక్షుడు జి.మంగయ్య, వలంటీర్‌లు వాణి, అరుణ కుమారి, శ్రీనివాస్, సమీర్ పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంతో ప్రాణాలకు రక్షణ

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిషోర్‌బాబు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు ప్రమాదాల సమయంలో వాహనదారుల ప్రాణాలకు రక్షణ లభిస్తుందని మూడో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు పేర్కొన్నారు. హెల్మెట్‌ను కేవలం పోలీసుల భయంతో కాకుండా, ప్రమాదాల సమయంలో ప్రాణాలను కాపాడుకునేందుకు ధరించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బీఆర్టీఎస్ రోడ్డులో రహదారి భద్రత నిబంధనలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కిషోర్‌బాబు మాట్లాడుతూ రహదారి భద్రత చర్యలను వాహనదారులకు వివరించారు. ప్రమాద సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. పాదచారులు కూడా రహదారులపై జాగ్రత్తగా ఉండాలన్నారు. జీబ్రా లైన్లు ఉన్నచోటే రోడ్డు దాటాలన్నారు.

పుట్‌పాత్‌ల వినియోగం సురక్షితం...

పాదచారులు ఫుట్‌పాత్‌లను ఉపయోగించుకోడం సురక్షితమన్నారు. నగరంలోని రహదారులపై ఉన్న ఫుట్‌పాత్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ముందు రోడ్డు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటిస్తే, వారు కూడా అనుసరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



నరేంద్రకుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సీఐఐ ఏపీ ఉపాధ్యక్షుడు నరేంద్రకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డేను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యాపార, పారిశ్రామిక రంగాలపై దృష్టి పెట్టాలన్నారు. ఆ దిశగా అడుగులు వేస్తే మంచి విజయాలు సొంతమవుతాయని చెప్పారు. విద్యార్థులు వ్యాపారంలో ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ప్రాముఖ్యతనివ్వాలన్నారు. మారుతున్న మార్కెట్ ధోరణులు, స్టార్టప్స్, మార్కెట్ సవాళ్లు తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన పరిచారు. ప్రధానంగా సృజనాత్మకతతో కూడిన అంశాలను ఆయన వివరిస్తూ ఆ దిశగా ఆలోచనలు చేయాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

భయందోళనలో స్థానికులు



తుప్పపట్టి కూలడానికి సిద్ధంగా ఉన్న స్తంభం

వింబిపేట(విజయవాడపశ్చిమ): స్థానిక 49వ డివిజన్ కొండ ప్రాంతంలో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగి ఎప్పుడు తమ నివాసాల మీద కూలుతుందోనని స్థానిక ప్రజలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్‌లోని వీరయ్యవీధి, కొండ ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం అడుగు భాగం తుప్పపట్టి శిథిలావస్థకు చేరుకుని పక్కకు ఒరిగిపోయింది. దీనిపై స్థానికులు నగరపాలకసంస్థ, విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఒరిగిన స్తంభానికి సపోర్టుగా భూమిలోకి పైపును దింపి ఇనుప వైర్లతో బిగించి వెళ్లిపోయారు. అయినప్పటికీ సమస్య తీరకపోగా స్తంభం అడుగు భాగం పాడయిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇది పక్కకు ఒరిగితే సమీపంలోని నివాసితుల ఇళ్లపై లేదా మెట్ల మార్గంపై పడి ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్ స్తంభం తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మెషిన్ లెర్నింగ్‌తో సులభంగా పనులు

జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కె.ఫణి శ్రీనివాస్



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): మెషిన్ లెర్నింగ్ వలన సామర్థ్యం, కచ్చితత్వంతో పనిచేయవచ్చునని జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ కె.ఫణిశ్రీనివాస్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ అంశంపై కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో గురువారం సదస్సు జరిగింది. ఫణి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెడికల్ ఇండస్ట్రీలో ఈ మెషిన్ లెర్నింగ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తున్నారని చెప్పారు. మెషిన్ లెర్నింగ్ అనేది గూగుల్, వాట్సాప్, అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్ మొదలైన ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ మీద నిర్వహిస్తారని ఈ మిషన్ లెర్నింగ్స్‌ను ఉపయోగించుకునే ఈ యాప్స్ అన్నీ రన్ అవుతుంటాయని వివరించారు. ఆటోమేటిక్, డ్రైవర్ లెస్ వాహనాలు పనిచేసేది కూడా ఈ మిషన్ లెర్నింగ్ వలనేనని ఆయన చెప్పారు. భవిష్యత్ అంతా మిషన్ లెర్నింగ్‌దేనని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఈ మిషన్ లెర్నింగ్ తోడ్పడుతుందని, సాంకేతిక అభివృద్ధిలో మిషన్ లెర్నింగ్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కళాశాల ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి కె.సాంబశివరావు మాట్లాడుతూ మెషిన్ లెర్నింగ్‌పై విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహనకు ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, అధ్యాపకులు డి.శ్రీనివాసరెడ్డి, జి.శశాంక, జి.నాగరాజు పాల్గొన్నారు. విద్యార్థుల సందేహాలకు ఫణి శ్రీనివాస్ సమాధానమిచ్చారు. అనంతరం ఫణి శ్రీనివాస్‌ను కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

సమాజ శ్రేయస్సే లయన్స్ ఆశయం

లయన్స్ గవర్నర్ ఆంజనేయులు



నూతన కార్యవర్గ సభ్యులకు బాధ్యతలు అప్పగిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమాజంలో ఉన్న పేద, బడుగు బలహీన వర్గాలకు విద్య, వైద్యం, ఆహారం అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపటమే లయన్స్ ఆశయం అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వీవీపీఎస్ ఆంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో గురువారం లయన్స్ క్లబ్ విజయవాడ దుర్గాతేజ, అంజలి, గీతాంజలి, అభయ, అవనిగడ్డ అవని క్లబ్‌ల సంయుక్త నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ రీజినల్ చైర్‌పర్సన్ డాక్టర్ యక్కటి సుధాకర్ బాబు, పూర్వపు జిల్లా గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు జిల్లా ఉప గవర్నర్లు ఎస్‌వీపీఎస్‌వీ ప్రసాద్, చెన్నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. నూతన క్లబ్‌ల అధ్యక్షులుగా యక్కటి విజయ దుర్గా పావని, డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్, పురాణం రాజేశ్వరశర్మ, వై.వాసుదేవరావు, ఈశ్వరరావు, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.